
## భీమాఫేజ్-1 నుంచి నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి

కొత్త కోట, జూన్ 22 : కొత్తకోట, మదనాపురం మండలాల శివార్లలో భీమా ఫేజ్-1 పంప్‌హౌస్ నుంచి ఆదివారం అధికారులతో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి దిగువకు నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి మాట్లాడుతూ.. భీమాఫేజ్-1 పంప్‌హౌస్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయడం సంతోషగా ఉందని పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురవడం వలన జూన్ నెలలోనే దిగువకు నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఏ ఒక్క రైతు వర్షాకాలపు పంటలకు ఇబ్బందులు పడకూడదని, రైతుల కష్టాలను తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రాజెక్టుల వలనే నేడు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రైతాంగానికి సాగు నీరు, తాగునీరు అందుతుందన్నారు.

**జూరాల నుంచి సాగునీరు విడుదల**

అమరచింత, జూన్ 22 : మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ వెంట రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఆదివారం అధికారులు, నాయకులతో కలిసి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈ నారాయణ, ఏఈ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎడమ కాల్వనుచి వానకాలం వరిపంటకు నారు మళ్లకు నీటిని విడుదల చేశామన్నారు.

## బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42శాతం కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

- **బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్**

ఇటిక్యాల, జూన్ 22 : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించి ప్రభుత్వం ఇచ్చినమాట నిలబెట్టుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఎర్రవల్లి చౌరస్తాలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ 42 శాతం రిజర్వేషన్ అమలుకు బాధ్యత తీసుకోవాలన్నారు. రిజర్వేషన్లపై పార్లమెంట్ అనుకూలంగా లేక పోతే ప్రత్యేక చట్టం తెచ్చి రిజర్వేషన్లను అమలుచేసి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. రిజర్వేషన్లపై ప్రభుత్వం యూటర్న్ తీసుకొంటే ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి తాను సిద్ధపడతానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహా, తాలూకా అధ్యక్షుడు రాజు, మండల అధ్యక్షుడు ఈదన్ననాయుడు బీసీ నాయకులు తదితరులు ఉన్నారు.

## సమాజ చైతన్యానికి కళలు దోహదపడాలి


మాట్లాడుతున్న జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌రెడ్డి

- **ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్న**

గద్వాల రూరల్, జూన్ 22 : ప్రజా చైతన్యానికి సాహిత్యం,కళలు దోహదపడతాయని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆశన్న అన్నారు. జిల్లా ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి కమిటీహాల్‌లో జిల్లా అధ్యక్షుడు అలీఅక్బర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అలంపూర్‌లో నిర్వహించిన శౌర్య యాత్ర బాలోత్సవం వంటి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను వివరించారు. భవిష్యత్ కార్యక్రమాల్లో భాగంగా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొనే కార్మికులకు, రైతులకు కూలీలకు మద్ధతుగా పాటలను ఆలపించేందుకు ఒక్క రోజు శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు నెలలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు మండల కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. జానపద వృత్తి కళాకారులకు, సాంస్కృతిక రంగాల్లో పని చేసే కళాకారులందరికీ ప్రభుత్వం తరఫున గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు జిల్లాలో నిర్వహించేందుకు కళాకారులు కృషి చేయాలని జిల్లాగౌరవ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లాలోని కళాకారులందరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో పీఎన్ఎం జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మి, ఉపాధ్యక్షుడు నరసింహా, అభిరామ్, తిమ్మప్ప పాల్గొన్నారు.

## మహిళలపై దాడులను అరికట్టాలి


మాట్లాడుతున్న ఐద్వా సంఘం నాయకులు

పాన్‌గల్, జూన్ 22 : రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా మహిళా సంఘం జిల్లా నాయకులు లక్ష్మి, సాయిలీల అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మహిళలకు సరైన రక్షణ కల్పించడం తోపాటు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. గత నాలుగు రోజుల కిందట తెల్లరాళ్లపల్లి తండాలో ఓ యువకుడు మైనర్ బాలికను కిడ్నాప్‌చేసి వివాహం చేసుకున్నా కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారని తెలిపారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఐద్వాసంఘం నాయకులు లక్ష్మి, అనిత, సాలమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెబ్బేరు, జూన్ 22 : స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని మండల నాయకులు చెప్పారు. ఎన్నికలకు కార్యకర్తల సమాయత్తం చేసేపనిలో భాగంగా ఆదివారం వారు కంచిరావుపల్లి, రంగాపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాములు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. అన్నిరంగాల్లో విఫలమైందన్నారు. స్థానికఎన్నికల్లో బీఆర్ఎస్‌కే అనుకూల వాతావరణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్, ఈశ్వర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన వంద రోజుల ప్రణాళిక

- **చెరువులను తలపిస్తున్న మురుగు గుంతలు**
- **ఎక్కడపడితే అక్కడే చెత్త**
- **కార్యాచరణ చేపట్టని అధికారులు**


వేధనగర్‌లో చెరువును తలపిస్తున్న మురుగు

గద్వాల టౌన్, జూన్ 22 : ప్రభుత్వం వందరోజుల ప్రణాళికతో మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. పారిశుధ్యంపై, డ్రైనేజీలపై దృష్టి సారించాలని ఎక్కడికక్కడే పారిశుధ్యం లోపించవద్దని సూచించింది. అందుకు తగ్గట్లుగానే మొదట్లో అధికారులు తూతూ మంత్రంగా అక్కడక్కడా పనులు చేపట్టి ఫొటోలు అప్‌లోడ్ చేసి ప్రణాళిక విజయవంతంగా ముందుకు సాగుతుందన్నట్లుగా గొప్పలు చెప్పుకొన్నారు. కాని క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులన్నీ కూడ చెత్తమయంగా కనిపిస్తున్నాయి. ఇక డ్రైనేజీలు చెత్తతో నిండిపోయి మురుగు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెల కొన్నది. కొన్ని ప్రాంతాల్లో మురుగు నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. కాని అధికారులు మాత్రం తాము విజయవంతంగా ప్రణాళికను అమలు చేస్తున్నామని చెప్పడం వారి పనితనానికి నిదర్శనంగా ఉందని చెప్పవొచ్చు.

**వార్డు అధికారులు ఉన్నా శూన్యం..**

మున్సిపాలిటీ అభివృద్ధి కోసం వార్డు అధికారుల నియామకం చేపట్టిన అభివృద్ధి మాత్రం శూన్యమనే చెప్పకతప్పదు. వార్డుల్లో అధికారులు పర్యటించిన సమస్యలు గుర్తించిన దాఖలాలు లేవు. మున్సిపాలిటీలో 29 మంది వార్డు అధికారులు ఉన్నారు. వారందరు కార్యాలయానికే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వారికి సరైన మార్గనిర్ధేశకాలు ఇవ్వడంలో ఉన్న తాధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు పనులు చేస్తున్నారే తప్పా ప్రజా అవసరాలను గుర్తించి ముందుకెళ్లడం లేదన్నది ప్రజల నుంచి వినిపిస్తున్న మాటలు. సమస్యలపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## పురాతన ఆలయాల శుద్ధి


శివకేశవ ఆలయంలో హిందూ జాగృతం సభ్యులు

పెబ్బేరు, జూన్ 22 : మనగుడి మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా హిందూ జాగృతం ఆధ్వర్యంలో ఆదివారం అయ్యవారిపల్లె, తిప్పాయిపల్లె గ్రామాల శివారులోని పురాతన శివకేశవ ఆలయం, కోనేరును శుభ్రం చేశారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 33 ఆలయాలను శుభ్రపరిచినట్లు సభ్యులు వెల్లడించారు.

## నిర్మాణ పనుల అడ్డగింత


పైపాడులో వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులవుతున్న దృశ్యం

వడ్డేపల్లి, జూన్ 22 : మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో మిషన్ భగీరథ నిధులతో నిర్మించ తలపెట్టిన వాటర్ ట్యాంకు పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. వాటర్‌ట్యాంకును పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్నారని దీంతో విద్యార్థులకు ప్రమాదాలవుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. భవిష్యత్తులో అదనపు గదులకు స్థలం ఉండదని వేరే స్థలంలో నిర్మించాలని గ్రామస్తులు వెంకటేశ్వర్లు, వీరేశ్, పరుశ, రాజ నరసింహ, శ్రీను తదితరులు కోరుతున్నారు.

## భగీరథ నీరందక.. గట్టులో కష్టాలు


సంతబజారులో నల్లానుంచి నీటిని తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్న ప్రజలు

గట్టు, జూన్ 22 : మండల కేంద్రంలో మిషన్ భగీరథ తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత రెండు, మూడు రోజులుగా తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యయప్రయాసాలు పడుతూ అరకొరగా నీటిని తెచ్చుకుంటూ కాలం గడుపుతున్నారు. కాగా రాయపురం శివారులో భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని చెబుతున్నా రు. తాగునీటిపై ఎవ్వరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులైనా స్పందించి తాగునీటి ఇబ్బందులను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలి


అమ్మపల్లిలో బీఆర్ఎస్ నాయకులు

పెద్దమందడి, జూన్ 22 : ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని అమ్మపల్లి గ్రామంలో మండల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులను రైతుభరోసా, రైతురుణమాఫీ, రైతుబీమా, బోనస్, మహిళలకు రూ. 2500, ఆసరాపింఛన్లు రూ.4వేలు, విద్యార్థులకు నిరుద్యోగభృతి, కేసీఆర్‌కిట్లు వంటి పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించాలని ప్రజలను కోరారు. సమావేశంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణుయాదవ్, నాయకులు కుమార్‌యాదవ్, నాగేంద్రం యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మన్నె పురెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సేవించిన యువకులపై కేసునమోదు

పాన్‌గల్, జూన్ 22 : మండలంలోని గోప్లాపూర్ స్టేజీ సమీపంలో ఆదివారం గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏదుల మండలం సింగాయిపల్లి గ్రామానికి చెందిన నాగనమోని శివ, గున్యానాయక్ తండా కాట్రావత్ తిరుపతి, పాన్‌గల్ మండలం రేమద్దులకు చెందిన మాంకాళి వంశీ, వనపర్తి మండలం సంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివరామకృష్ణ, వనపర్తి పట్టణం గాంధీచౌక్‌కు చెందిన ఉందేకోటి భానుప్రకాశ్ స్నేహితులు. వీరు ఆదివారం అందరూ కలిసి గోప్లాపూర్ శివారులో గంజాయి సేవిస్తుండగా సమాచారం మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి దాడి చేసి వారి దగ్గర ఉన్న 40గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని ఐదుగురి యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అత్యుత్తమ గ్రంథం భగవద్గీత

- **డాక్టర్ ఎల్‌వీ గంగాధర శాస్త్రి**

వనపర్తి, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : ప్రపంచంలోనే అత్యుత్తమమైన గ్రంథం భగవద్గీత అని భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎల్‌వీ గంగాధర శాస్త్రి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో భగవద్గీత విజయభేరి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంగాధర శాస్త్రి పాల్గొని మాట్లాడారు. భారత దేశ ఔన్నత్యం చాలా గొప్పదని, ఇతరదేశాల విధానాలకు,మన దేశ సంస్కృతి సాంప్రదాయల కు చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. 5 వేల సంవత్సరాలకు పూర్వమే సనాతనధర్మం ఆవిర్భవించిందని, భగవద్గీత ఒక మతానికి చెందినది కాదన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రకృతిని విస్మరిస్తూ కేవలం డబ్బు సంపాదించడమే ముఖ్యమన్నట్లుగా మారి మోడ్రనైజ్ పేరుతో పెడదోవ పడుతున్నారన్నారు. పిల్లల కోసం తల్లి తండ్రులు సమయం కేటాయించాలని,అప్పుడే విద్యార్థులకు అన్ని విషయాలపై అవగాహన పెరుగుతుందన్నారు.అలా లేనందువల్లే చిన్న విషయాలకు కూడా ఆత్మహత్యల వైపు వెళుతున్నారన్నారు.ర్యాంకుల కోసం కాకుండా విజ్ఞానం కోసం చదవును కొనసాగిస్తూ,హిందు సంప్రదాయాలు,సంస్కృతిని విద్యార్థి దశలోనే అలవాటు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంగాధర శాస్త్రి

## చికిత్సపొందుతూ ఆర్మీ జవాన్ మృతి


రామానాయుడు (ఫైల్)


వడ్డేపల్లి, జూన్ 22 : మండలంలోని కొంకల గ్రామానికి చెందిన రామానాయుడు (25) వ్యక్తిగత సమస్యలతో ఈ నెల 13వ తేదీన పురుగుల మందు తాగాడు. అతడి బంధువులు చికిత్స నిమిత్తం కర్నూలు దవాఖానకు తరలించారు. 17వ తేదీ హైదరాబాద్ నుంచి ఆర్మీ అధికారులు వచ్చి మెరుగైన చికిత్స కోసం కర్నూలు నుంచి సికింద్రాబాద్ ఆర్మీ దవాఖానకు తరలించా రు. 18వ తేదీన సికింద్రాబాద్ నుంచి మహారాష్ట్ర పూణే ఆర్మీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ 21వ తేదీ అర్ధరాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని పూణేలోనే ఉంచారన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

గద్వాల టౌన్, జూన్ 22 : ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాల్‌నరసింహ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోది పాలనలో దేశం ధనవంతుల చేతుల్లోకి వెల్లిందని ఆరోపించారు. పార్టీ నిర్మాణం కోసం జిల్లా కమిటీ పోరాటం చేయాలని సూచించారు. జిల్లా మహసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆంజనేయులు, కృష్ణ, సిద్దప్ప, రంగన్న, కాసీం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- **స్వామి తత్పదానంద మహారాజ్**


భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న స్వామీజీ

అయిజ రూరల్, జూన్ 22 : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని హైదరాబాద్ రామకృష్ణ మఠ స్వామీజీ తత్పదానంద మహారాజ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సంకాపురం గ్రామంలోని రామకృష్ణ ధ్యానమందిరంను సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగాభక్తులనుద్దేశించి స్వామీజీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమపిల్లలను చిన్నతనంలోనే ఆధ్యాత్మిక భావాల వైపు మార్చాలన్నారు. యువత వివేకానంద స్వామిని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర భావప్రచారి షత్ మాజీ కన్వీనర్ సూర్యప్రకాశ్, రామకృష్ణ సేవాసమితి సభ్యులు సత్యనారాయణ, కృష్ణ, ఈశ్వర్, దామోదర్, గోపాల్, ఈశ్వరన్న, గ్రామస్తులు రాముడు, దేవర గోపాల్, ఉరుకుంద, రామలింగం, నర్సింహులు, మల్లన్న, ఈరన్న, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల కళాశాలలో విద్యార్థుల అల్లరి

### అడ్డుకున్న కాలనీవాసులు


మైనార్టీ కళాశాల విద్యార్థులకు నచ్చుజెప్పున్న కాలనీవాసులు

వపనర్తి టౌన్, జూన్ 22 : జిల్లా కేంద్రంలోని సాయినాథ్ కాలనీలో ఉన్న మైనార్టీ కళాశాల విద్యార్థులు ఆదివారం బీభత్సం సృష్టించారు. విద్యార్థులు కళాశాల ముందు చేరి డార్మెంట్‌లో ఉన్న మంచాలు, కంచాలతో భయంకరమైన శబ్దాలు చేస్తూ విరగకొడుతూ అల్లరి చేస్తుండడంతో సాయినాథ్ కాలనీ వాసులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే కాలనీవాసులు కళాశాలకు వద్దకు చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పారు. అక్కడున్న సిబ్బందితో, విద్యార్థులతో మాట్లాడి మరోసారి ఇలాంటి భయంకరమైన అల్లర్లు , శబ్దాలు చేస్తే పాఠశాల, కళాశాల నుంచి తరలించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.


చేతికర్రలు, స్టాండ్‌లను పంపిణీ చేస్తున్న టీజీ మహేశ్

## వృద్ధులకు స్టాండ్, చేతికర్రల పంపిణీ

కొత్త కోట, జూన్ 22 : మండలంలోని రామనంతపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేశ్ తన నివాసంలో 60 మంది వృద్ధులకు స్టాండ్, చేతికర్రలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. వృద్ధులు లేచి నిలబడడం చాలా కష్టమైనదని, అందుకే వారు నడిచేవిధంగా చేతికర్రలను, స్టాండ్‌లను పంపిణీ చేశామన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చిన్నారెడ్డి


చక్రపాణి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట, జూన్ 22 : మండల కేంద్రానికి చెందిన విశాంత ఉపాధ్యాయుడు చక్రపాణి శనివారం మృతి చెందాడు. ఆదివారం మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాధ నుంచి త్వరగా కోలుకొని ధైర్యంగా ఉండాలని మనోధైర్యం తెలిపారు.

## అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జూన్ 22 : తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో బోధించేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకానమిక్స్ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయని చెప్పారు. సంబంధిత పీజీలో 55 శాతం మార్కులు, నెట్ లేదా సెట్ అర్హతతో పాటు మూడేళ్ల బోధనా అనుభవం అవసరమని చెప్పారు. అభ్యర్థులు ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు 9441169432, 8500545585 నెంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటా



ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గోకారి

రాజోళి, జూన్ 22 : మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బాధ్యతలు తీసకున్న ఎస్సై గోకారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజోళిలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై జగదీశ్ ఇటీవలే వీఆర్ అటాచ్ చేశారు. ఆయనను నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు ఎస్సైగా పోస్టింగ్ ఇవ్వగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై గోకారిని రాజోళికి బదిలీచేశారు. ఆదివారం రాజోళి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. మండల గ్రామాలు ఏపీ రాష్ట్ర సరిహద్దు కావడంతో కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనబడిన సమాచారం ఇవ్వాలని కోరారు.

## మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గద్వాల టౌన్, జూన్ 22 : మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేబాధ్యత నేటి యువతపై ఉందని రైల్వే ఎస్సై ధర్మారావు అన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగాహాజరై మాట్లాడుతూ.. నేటి ఎందరో యువత చెడు వ్యసనాలకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. నిజమైన స్నేహితులు తమ స్నేహితులు మాదకద్రవ్యాల బారిన పడకుండాఆపుతాడని, అలా చేయని వాడు స్నేహితుడే కాదన్నాడు. మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా నివారించాల్సిన సామాజిక బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఎవరైన మత్తు పదార్థాలు వాడితే 100, 14446, 1908 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య, చైల్డ్ లైన్ కౌన్సిలర్ జయన్న, కేసు వర్కర్ లక్ష్మి, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.